సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 6 । ఆగస్టు । 2024



రూ.2,25,612 విరాళం


సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు కోకా పార్వతీ ప్రమీల శేషకుమారి, కుటుంబ సభ్యులు (కాకినాడ రూరల్ వలసపాకల) రూ.2,25,612 విరాళం సమర్పించారు.



రారండోయ్.. వేడుక చూద్దాం

అన్నవరంలో మంగళవారం జరిగే సత్యదేవుని ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలకు సోమవారం అంకురార్పణ జరిగింది. దీంతో రత్నగిరికి ఆధ్యాత్మిక శోభ వచ్చింది. 8లో

కడలిలోకి 6.33 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమ వారం రాత్రి 7 గంటలకు 6,33,226 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. ఎగువన భద్రాచలంలో ప్రవాహం క్రమేపీ తగ్గుతూండటంతో ధవళేశ్వరం వద్ద నీటి ఉధృతి మంగళవారం తగ్గే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.

దేవస్థానం కోసం..

- ప్రముఖ ఆలయాల్లో చైర్మన్ గిరికి పోటీ
- క్యూ కడుతున్న కూటమి నేతలు
- చేతులు తడిపేందుకూ సిద్ధం
- ఈఓ పోస్టులకు సైతం పైరవీలు

సాక్షి, అమలాపురం: కుర్చీ కోసం పాకులాట మొదలైంది.. దేవ'స్థానాల్లో' చైర్మన్ గిరికి తీవ్ర పోటీ నెలకొంది. కూటమి నేతలు ఆలయాల్లో పాలక మండలి చైర్మన్ పదవులకు.. అధికారులు ఈఓ పోస్టింగ్‌ల కోసం పైరవీలు చేస్తూ, దీనికి ముడుపులు సైతం చెల్లించేందుకు సిద్ధమవుతున్నారని తెలియవచ్చింది.

కోనసీమ జిల్లా ఆధ్యాత్మికంగా పురాణ ప్రసిద్ధి చెందింది. అనేక ఆలయాలకు భక్తుల తాకిడి గణనీయంగా పెరిగింది. కరోనా తరువాత ప్రతి ఆలయానికి భక్తుల సంఖ్య రెట్టింపయ్యింది. ఇదే ఇప్పుడు కూటమి పార్టీకి చెందిన ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులను ఆకర్షిస్తోంది. సాధారణంగా ఎమ్మెల్యే తరువాత నియోజకవర్గంలో గుర్తింపు పొందిన పదవి మార్కెట్ కమిటీ చైర్మన్ (ఏఎంసీ), రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు. ఇప్పుడు మాత్రం ప్రముఖ ఆలయాల చైర్మన్ పదవులు కీలకమవుతున్నాయి. జిల్లాలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానంతోపాటు అయినవిల్లి సిద్ధి వినాయక స్వామి, అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం, అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి, మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయాలు ప్రసిద్ధి చెందాయి. ఈ ఆలయాలకు ఆదాయంతో పాటు రూ.కోట్ల విలువైన ఆస్తులూ ఉన్నాయి. ఒకప్పుడు ఆలయాల అభివృద్ధి కమిటీల పాలకవర్గాలంటే సేవా భావంతో పనిచేసేవి. కానీ ఇప్పుడు రాజకీయ నేతలకు పదవులు అలంకార ప్రాయంగా మారాయి. ఎంత పెద్ద ఆలయానికి చైర్మన్ చేస్తే అంత గుర్తింపు అన్నట్లు మారిపోయింది. దీనితో ఆయా ఆలయాలకు చైర్మన్ పదవులకు పోటీ పెరిగిపోతోంది. టీడీపీ నుంచే కాకుండా జనసేన, బీజేపీ నాయకులు కూడా పదవుల కోసం క్యూ కడుతున్నారు. ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకోవడంతో పాటు అమరావతి వెళ్లి సీఎం చంద్రబాబు కుమారుడు నారా లోకేష్ వద్ద తమ పదవుల కోసం సిఫార్సులు చేయించుకుంటున్నారు.



వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం

రెండు వర్గాలుగా చీలి..

సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెంలో పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయ నిర్వహణపై రెండు వర్గాలు బలంగా తలపడుతున్నాయి. ఆలయ నిర్వహణ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉండగా జనసేనలో రెండు వర్గాలు బలంగా పోటీ పడుతున్నారు. ఏటా సంవత్సరాది ముందు ఏకంగా నెల రోజుల పాటు తీర్థ మహోత్సవాలు, జాతరలు జరుగుతుంటాయి. ధర్మకర్త మండలం పదవి కోసం రెండు వర్గాలు పోటీ పడుతుండగా పార్టీ నియోజకవర్గ నాయకత్వం రెండుగా చీలి ఆశావహులకు మద్దతుగా నిలుస్తుంది.

నాలుగైదేళ్ల నుంచి..

గడిచిన నాలుగైదు ఏళ్ల నుంచి వాడపల్లి దేవస్థానం ఆదాయంలో అగ్రస్థానం దక్కించుకుంటుంది. ఈ క్షేత్రాన్ని శనివారం ఒక్కరోజే సుమారు 40 వేల నుంచి 50 వేల మంది భక్తులు దర్శించుకుంటున్నారు. ఏడాదికి ఆదాయం రూ.50 కోట్ల వరకూ వస్తోంది. ఇవి కాకుండా లెక్కకుమించి ఆస్తులున్నాయి. ఈ ఆలయానికి చైర్మన్ పదవి అత్యంత కీలకంగా మారింది. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని వారికే ఈ పదవి వరిస్తోంది. ఒకటి రెండు సందర్భాల్లో క్షత్రియ సామాజికవర్గానికి చెందిన వారికి ఈ పదవి ఇవ్వడం ఆనవాయితీగా మారింది. టీడీపీ నుంచి ఈసారి ఈ పదవికి అదే సామాజిక వర్గానికి చెందిన వారు హోరాహోరీగా తలపడుతున్నారు. ఈ పదవిపై ఆశతో ఎన్నికల సమయంలో పార్టీ ఖర్చును భరించిన ఒక నాయకుడితో పాటు పార్టీని అప్పుల రూపంలో ఆదుకున్న మరో నాయకుడు పైరవీలు చేస్తున్నారు. జనసేన పార్టీ నాయకులు సైతం చైర్మన్ పదవి తమకు ఇవ్వాలని కోరుతున్నారు.

పోటీ పడుతూ.. పైరవీలు చేస్తూ

అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పదవిని టీడీపీ నుంచి మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, జనసేన నుంచి కంకిపాటి నరసింహారావు ఆశిస్తున్నారు. అయినవిల్లి సిద్ధి వినాయక స్వామి ఆలయ చైర్మన్ పదవికి సైతం గట్టి పోటీ నెలకొంది. టీడీపీ నుంచి తోట సుబ్బారావు, జనసేన నుంచి తోలేటి ఉమాల మధ్య పోటీ ఉంది. టీడీపీ నుంచి ఆశిస్తున్న సుబ్బారావు స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో సంబంధం లేకుండా లోకేష్ ద్వారా పైరవీలు చేయించుకుంటున్నారు. మురమళ్ల భద్రకాళీ వీరేశ్వరస్వామి ఆలయం చైర్మన్ పదవికి సైతం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజుపై పార్టీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారు. ఎమ్మెల్యే సొంత సామాజిక వర్గానికి చెందినవారే పోటీ పడుతుండడం గమనార్హం.



అయినవిల్లి శ్రీసిద్ధి వినాయక స్వామి ఆలయం

ఈఓ పోస్టుల కోసం..

జిల్లాలో ప్రధాన ఆలయాల్లో ఈఓ పోస్టుల కోసం ఎమ్మెల్యేల వద్దకు ఉద్యోగులు బారులు తీరుతున్నారు. కొత్త ప్రభుత్వంలో బదిలీలపై ఎటువంటి నిర్ణయం ప్రకటించకున్నా ముందే ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మొత్తం బదిలీల్లో జిల్లాలో ఒక కీలక ఆలయానికి ఈఓగా ఉన్న 'కింగ్' చురుగ్గా వ్యవహరిస్తున్నారు. సదరు ఉన్నత ఉద్యోగి ఒక ఆలయంలో రెగ్యులర్ పోస్టులో పనిచేయడంతో పాటు మరో ఆలయానికి ఇన్‌చార్జిగా ఉంటున్నారు. ఈసారి కూడా ఇదే పద్ధతిలో ఆయనకు రెండు కీలక ఆలయాలు అప్పగించాలని టీడీపీ ఎమ్మెల్యేలు పైరవీలు చేస్తుండడం విశేషం. గతంలో గ్రేడ్-1 ఆలయంలో ఈఓగా ఉండి కూడా డీసీ క్యాడర్ దేవాలయానికి ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కీలక ఆలయాలకు ఈఓ పదవుల కోసం కొందరు ముడుపులు చెల్లించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

న్యూస్‌రీల్

తెరుచుకున్న సఖినేటిపల్లి రేవు



సఖినేటిపల్లి- నరసాపురం రేవులో పంటు రాకపోకలు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి- నరసాపురం రేవులో పంట్ల రాకపోకలు సోమవారం నుంచి మొదలయ్యాయి. వరద నీటి ప్రవాహ ఉధృతి నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా గత నెల 21వ తేదీ నుంచి పశ్చిమగోదావరి జిల్లా అధికారులు రేవును బంద్ చేశారు. ఈ మేరకు గోదావరి నదిపై పంటు, నాటు పడవల ప్రయాణాలను నిలిపివేశారు. కాగా రేవు వద్ద 15 రోజుల అనంతరం తిరిగి పంటు రాకపోకలు పునరుద్ధరించడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విజన్ ప్లాన్‌ను రూపొందించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: రానున్న ఐదేళ్లకు 2024-29 జిల్లా స్థాయి విజన్ ప్లాన్‌ను రూపొందించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. సోమవారం అమరావతిలోని సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ 2047కు అనుగుణంగా వికసిత్ ఆంధ్ర 2047 విజన్ ప్రణాళిక రూపొందించే విషయమై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమలాపురం కలెక్టరేట్ నుంచి జేసీ నిషాంతి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో జేసీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా జిల్లా విజన్ ప్లాన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. బ్యాంకర్లు పారిశ్రామిక వేత్తలు, చాంబర్ ఆఫ్ కామర్స్, విద్యా సంస్థలతో సమావేశాలు ఏర్పాటు చేసి అభిప్రాయాలు తీసుకోవాలన్నారు.

1998 ఎంటీఎస్ టీచర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా కేశవకుమార్



అమలాపురం టౌన్: 1998 మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా అంబాజీపేట మండలం గంగలకుర్తి అగ్రహారానికి చెందిన చొల్లంగి కేశవకుమార్ ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం రాత్రి జరిగిన 1998 ఎంటీఎస్ టీచర్స్ రాష్ట్ర అసోసియేషన్ సమావేశం కేశవకుమార్‌తో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ మేరకు సోమవారం అమలాపురంలో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తమ ఎంటీఎస్ టీచర్స్ యూనియన్ ఎస్టీయూ ఏపీ శాఖకు అనుబంధంగా పనిచేస్తుందని వెల్లడించారు. ఇదే అంశాన్ని రాష్ట్ర సమావేశంలో తీర్మానం కూడా చేశామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తమ ఎంటీఎస్ టీచర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై రాష్ట్ర సమావేశం చర్చించిందన్నారు. ఉద్యోగ విరమణ వయసు 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

వివిధ పోస్టులకు నియామక పత్రాలు

అమలాపురం రూరల్: జిల్లాలోని వివిధ ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులకు సంబంధించి జేసీ ఆధ్వర్యంలోని జాయింట్ కమిటీ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులకు సోమవారం జేసీ టి.నిషాంతి నియామక పత్రాలు అందజేశారు. డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ విభాగంలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్-1, ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఇనిస్టిట్యూషనల్ కేర్)-1, ప్రొటెక్షన్ ఆఫీసర్ (నాన్ ఇనిస్టిట్యూషనల్ కేర్)-1, కౌన్సిలర్-2, సోషల్ వర్కర్-1, అసిస్టెంట్ కం డేటా ఎంట్రీ ఆపరేటర్-1, డేటా అనలిస్ట్-1, అవుట్ రీచ్ వర్కర్-1 పోస్టులకు అభ్యర్థులను కమిటీ ఎంపిక చేసింది. అదే విధంగా స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ విభాగంలో ఖాళీలకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో మేనేజర్, సోషల్ వర్కర్ కం చిల్డ్రన్ ఎడ్యుకేటర్, నర్స్, డాక్టర్ పోస్టులు, ఆయా-6, చౌకీదర్-1 పోస్టుకు ఎంపిక చేశారు. వీరందరికీ కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ నియామక పత్రాలు అందజేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా ఎంపికైన వీరంతా వారం రోజుల్లోపు ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలన్నారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆదేశించారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరిగింది. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణి, పౌరసరఫరాల డీఎం ఎల్లారావు, సమగ్ర శిక్ష డిప్యూటీ కలెక్టర్ ఎ.మధుసూదన్‌రావులు ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. డీఆర్వో మాట్లాడుతూ అందిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మండల, డివిజన్ స్థాయిల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 212 అర్జీలు అందాయని తెలిపారు.

ఎస్పీ కార్యాలయానికి 22 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 22 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా నిర్వహించారు. వచ్చిన ఫిర్యాదుల్లో 5 సివిల్ వివాదాలు, 10 ఇతర సమస్యలు, 7 కుటుంబ తగాదాలకు సంబంధించినవి ఉన్నాయి. అమలాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో 10, కొత్తపేట సబ్ డివిజన్‌లో 7, రామచంద్రపురం సబ్ డివిజన్ నుంచి 5 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించాలని ఏఎస్పీ బాషా ఆదేశించారు. సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ ఎస్సై డి.శశాంక పాల్గొన్నారు.

కూలి డబ్బులు ఇవ్వండి బాబూ!

ఖాళీ ప్లేట్లతో ఉపాధి కూలీల నిరసన

అమలాపురం రూరల్: చేసిన పనులకు కూలి ఇవ్వడంటూ ఖాళీ ప్లేట్లతో ఉపాధి కూలీలు తమ ఆవేదనను తెలిపారు. అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 350 మంది కూలీలు సోమవారం ఆందోళన చేశారు. జిల్లాలో మే 19 నుంచి ఉపాధి వేతన బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో సుమారు రూ.72 కోట్లను కూలీలకు ఇవ్వాలని, తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూలీల ఆకలి బాధలు తక్షణం తీర్చాలన్నారు. అప్పుల్లో ఉన్నామని కూలీలను ఇబ్బందులు గురిచేయడం ప్రభుత్వానికి తగదని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు నెలలుగా చేసిన పనులకు వేతనాలు ఇవ్వకుండా ఉపాధి కూలీలను పస్తులు ఉంచుతుందన్నారు. కూలీల బాధలు అర్థం చేసుకుని, తక్షణం స్పందించాలన్నారు. వారం రోజుల్లో బకాయి వేతనాలను విడుదల చేయకపోతే కలెక్టరేట్‌ను నిర్బంధిస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేస్తున్నాయన్నారు. రాజకీయ వేధింపులతో మేట్లను తొలగిస్తే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకులు పాలమూరు శ్రీనివాసరావు, తాడి శ్రీరామ్మూర్తి, ఇసుపట్ల మంగాదేవి, ఎం.రాజేశ్వరి, పెట్ట ఆనందరావు రాయుడు వెర్రమ్మ, మంగాలక్ష్మి, గుత్తుల సత్యవతి తదితరులు నాయకత్వం వహించారు.



అమలాపురం కలెక్టరేట్ వద్ద ఖాళీ ప్లేట్లతో ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

కూటమి నేతల వేధింపులు ఆపండి

స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగుల ధర్నా

అమలాపురం రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ కూటమి నేతల రాజకీయ వేధింపులపై స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. రాజకీయ కారణాలతో తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అమలాపురం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్వోకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, జిల్లా అధ్యక్షుడు ఎ.దుర్గాప్రసాద్, సీఐటీయూ జిల్లా కోశాధికారి ఒ.కృష్ణవేణి, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలక సుభాషిణి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యవేణి, కంటింజెంట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమ, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పరంధామయ్య మాట్లాడుతూ కొన్ని మండలాల్లో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ స్వీపర్లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు యానిమేటర్లను రాజీనామా చేయాలని తీవ్రమైన రాజకీయ ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఎన్నికల ముందు కూటమి నేతలు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి, నేడు అధికారంలోకి రాగానే తొలగిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఉద్యోగులను మార్చడానికి రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ వేధింపులపై స్థానిక ఎమ్మెల్యేలను కలుస్తుంటే పరిష్కరించాల్సిన వారు పట్టించుకోవడం లేదన్నారు. కూటమి నాయకులను కట్టడి చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో 108 జిల్లా అధ్యక్షుడు జితేంద్ర, అంగన్‌వాడీ సంఘ సభ్యులు విజయ, వెంకటలక్ష్మి, సూర్యకళ, ఆశ సంఘ సభ్యులు ఎస్తేర్ రాణి, దేవి, నాగమణి, పద్మావతి పాల్గొన్నారు.



రాజకీయ వేధింపులపై కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు తదితరులు

పోలీసు బదిలీలలు

- అక్రమార్కులకు కోరుకున్న చోట పోస్టింగ్
- ప్రతి పోస్టుకు ఓ రేటు
- జిల్లా పోలీసు కార్యాలయంలో చక్రం తిప్పిన ఇద్దరు ఉద్యోగులు
- రూ.40 లక్షలు పైగా చేతులు మారాయని ఆరోపణలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సార్వత్రిక ఎన్నికలు, ఓట్ల లెక్కింపు, కొత్త ప్రభుత్వం ఏర్పాటు వంటి కీలకమైన విధుల్లో పోలీసు ఉన్నతాధికారులు తలమునకలవుతున్న సమయం అది. జిల్లాలో రాజకీయంగా ఉన్న ప్రత్యేక పరిస్థితుల్లో జిల్లా పోలీసు ఉన్నతాధికారులు శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టిన రోజులవి. జిల్లా పోలీసు కార్యాలయంలో పరిపాలనా వ్యవహారాల నుంచి జిల్లా ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు అటువైపు కాస్త దృష్టి మళ్లించారు. అదే అదనుగా ఆ కార్యాలయంలో ఇద్దరు దిగువ స్థాయి ఉద్యోగులు చక్రం తిప్పి, అన్నీ తామే అన్నట్టు బదిలీలు చేసేసి లక్షల రూపాయలు దిగమింగేశారు. రోజువారీ నిర్వహించే పాలనా వ్యవహారాల ఫైళ్లలో బదిలీల ఫైళ్లను కూడా గుట్టు చప్పుడు కాకుండా కలిపేసి, బరితెగించి మరీ పోలీసు అధికారులతో సంతకాలు పెట్టించేశారు. ఈ మధ్యంతర బదిలీల్లో అక్షరాలా రూ.40 లక్షలు చేతులు మారాయనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ అడ్డగోలు బదిలీలు పూర్తయ్యే సమయానికి ఉన్నతాధికారుల సాధారణ బదిలీలు కూడా ముగిసిపోవడంతో చేసేది లేక మిన్నకుండి పోవాల్సి వచ్చిందని అంటున్నారు. ఈ బదిలీల బాగోతం చూసి ప్రస్తుత అధికారులు విస్తుపోతున్నారు. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఈ అక్రమ బాగోతం వివరాలివీ..

వారే లక్ష్యంగా..

అవినీతిలో కూరుకుపోయి సస్పెండైన వారు, దీర్ఘ కాలం ఒకే స్థానంలో పని చేస్తున్న వారు, ప్రాధాన్యం లేని పోస్టుల్లో పని చేస్తున్న కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్లే లక్ష్యంగా ఈ అక్రమ బదిలీల దందా నడిచింది. ప్రతి బదిలీకి ఒక రేటు నిర్ణయించి అక్రమార్కులైన ఆ ఉద్యోగులు దండుకున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకూ వసూళ్లకు తెగబడ్డారు. నెల రోజుల వ్యవధిలో చడీచప్పుడు కాకుండా 20 మందిని కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేశారు. ఈ వ్యవహారంలో రూ.40 లక్షలు పైగా చేతులు మారాయని పోలీసు వర్గాల్లోనే చర్చ జరుగుతోంది. ఈ బదిలీల ప్రక్రియకు సంబంధించిన ఫైళ్లను రోజువారీ ఫైళ్లతో కలిపి రోజుకు రెండు మూడు చొప్పున పోలీసు అధికారి టేబుల్ మీదకు చేరేలా ఏర్పాటు చేశారని అంటున్నారు. ఆ పోలీసు అధికారి విధులు ముగించుకుని వెళ్లిపోయే చివరి నిమిషంలో ఈ ఫైళ్లు వచ్చేలా చేసేవారని సమాచారం. ఆ ఇద్దరు ఉద్యోగులపై ఉన్న నమ్మకంతో ఆ పోలీసు అధికారి కూడా సంతకాలు చేసేశారని చెబుతున్నారు. మామూలుగా ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారికి బదిలీ తప్పదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో కసరత్తు వేగం అందుకుంది. సాధారణ బదిలీలు ఇప్పటికే జరుగుతున్నాయి. అయితే, ముందస్తు బదిలీలు చేయడం ద్వారా ఈ 20 మందీ సాధారణ బదిలీల నుంచి తప్పించుకోవడంలో ఆ ఇద్దరు ఉద్యోగులు చాకచక్యంగా వ్యవహరించారని అంటున్నారు.

అడ్డగోలు బదిలీల్లో కొన్ని..

- పిఠాపురం సర్కిల్‌లో ఓ వ్యక్తి నుంచి 2023లో రూ.లక్ష లంచం తీసుకున్న హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా జగ్గంపేట, ఏలేశ్వరం స్టేషన్లకు అటాచ్ చేశారు. ఏడాది తిరగకుండానే వీరిద్దరూ తాము కోరుకున్న పిఠాపురం, పెద్దాపురం పోలీస్ స్టేషన్లకు బదిలీ ఉత్తర్వులు పొందారు. వీరిపై చర్యలు తీసుకున్న పోలీసు అధికారే పూర్వపు స్థానాలకు 14/7/24న సీ.నం.6737/ఏ1/2024 మెమో ద్వారా బదిలీ ఉత్తర్వులు ఇవ్వడం విచిత్రం. గతంలో తాను సస్పెండ్ చేసిన విషయం గుర్తుంటే తిరిగి అదే పిఠాపురం సర్కిల్‌కే బదిలీ ఉత్తర్వులు ఎలా ఇస్తారని అంటున్నారు. ఆయనను నమ్మించి కళ్లు మూసి, ఆ ఇద్దరు ఉద్యోగులూ అన్నీ తామే అయి ఈ వ్యవహారం నడిపించినట్టు చెబుతున్నారు.
- తిమ్మాపురం, సర్పవరం పోలీసు స్టేషన్లలో కీలక విభాగంలో పని చేసి పదోన్నతి పొందిన ఓ ఏఎస్సైని ఈ ఏడాది మార్చి 14న కోరంగి పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. బదిలీల బాగోతంలో చక్రం తిప్పిన ఓ ఉద్యోగి భరోసాతో అతను ఆ విభాగాన్ని వదల్లేదు. కోరంగి వెళ్లనూ లేదు. ఇదే ఏఎస్సైకి మూడు నెలలు తిరగకుండానే గత జూన్ 13న సీ.నం.2680/ఏ1/2023-24తో పోలీసు కార్యాలయంలోనే కొనసాగేలా అటాచ్‌మెంట్ ఆర్డర్ రావడం గమనార్హం. గతంలో ఎప్పుడూ డీసీఆర్‌బీలో ఈ తరహా పోస్టింగ్ లేకపోవడంపై పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.
- 14 ఏళ్లుగా డీఎస్‌బీలోనే కొనసాగుతున్న ఒక కానిస్టేబుల్‌ను పేరుకు కోరంగి బదిలీ చేసినట్టే చేసి, తిరిగి డీఎస్‌బీకి సీ.నం.7338/ఏ1/2024 ద్వారా అటాచ్‌మెంట్ ఇచ్చారు.
- ఇదే కోవలో పిఠాపురం టౌన్ నుంచి మరో కానిస్టేబుల్‌ను 14/7/24న పేరుకు తిమ్మాపురం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్టు పేపర్‌పై చూపించారు. కానీ అక్కడి నుంచి మళ్లీ డీఎస్‌బీకే అటాచ్‌మెంట్ ఇచ్చారు. పేరుకే బదిలీ తప్ప, అతను పూర్వ స్థానంలోనే కొనసాగుతున్నట్టు లెక్క.
- కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో డ్యూటీ ఆర్డర్ (డీఓ) ఉండి డీఎస్‌బీలో కొనసాగుతున్న మరో కానిస్టేబుల్‌ను ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసి, తిరిగి డీఎస్‌బీకే అటాచ్‌మెంట్ ఇచ్చారు. వీటన్నింటి వెనుక ఆ ఇద్దరు ఉద్యోగులు ఉన్నారని చెబుతున్నారు.

అన్నీ విడ్డూరాలే..

క్రమశిక్షణా చర్యల్లో భాగంగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని జిల్లా పోలీసు అధికారి ఒకప్పుడు బదిలీ చేస్తే.. అటువంటి వారిని కూడా తిరిగి పూర్వపు స్థానాలకు బదిలీ చేయడం పోలీసు వర్గాలను విస్మయానికి గురి చేస్తోంది. అవినీతి నిర్ధారణ అయిన ఇద్దరు కానిస్టేబుళ్లను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా నాటి ఎస్పీ పిఠాపురం సర్కిల్ నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. బదిలీ చేసిన ఏడాది తిరగకుండానే ఆ ఇద్దరికీ కోరుకున్న చోట జిల్లా పోలీసు కార్యాలయంలోని అక్రమార్కులు పోస్టింగ్ ఇప్పించడం విడ్డూరంగానే ఉంది. కొన్ని బదిలీలు పేపర్ పైనే జరిగాయి తప్ప వారందరూ ఎక్కడి వారు అక్కడే పని చేస్తూండటం విశేషం. ఉన్న స్థానాల్లోనే కొనసాగుతున్న వారు ఆరుగురున్నారు. పదోన్నతి లభించినా పాత కుర్చీలోనే వారు కొనసాగుతూండటం వెనుక మర్మమేమిటనేది జవాబు లేని ప్రశ్నగానే మిగులుతోంది.



కాకినాడలోని జిల్లా ఎస్పీ కార్యాలయం

వారిపై ఎన్నో ఆరోపణలు

ఈ అక్రమాలకు పాల్పడిన వారిలో ఒక ఉద్యోగి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు డివిజనల్ పోలీసు కార్యాలయాల్లో పని చేశారు. ఆ అనుభవంతో ఆకస్మిక తనిఖీలప్పుడు కొన్నిచోట్ల అమ్యామ్యాలకు వెనుకాడే వారు కాదని పలువురు చెబుతున్నారు. స్టేషన్ రిమార్క్స్ రాసే సందర్భంలో ఈ తతంగం నడిపించే వారనే ఆరోపణలున్నాయి. ఈ ఇద్దరిలో మరొకరైన అధికారిని గత ఎస్పీ సతీష్ కుమార్ ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఏరి కోరి ఇక్కడకు తీసుకు వచ్చారని అంటున్నారు. ఆయన గత మే 31న రిటైరయ్యారు. ఇప్పుడు ఆయన దృష్టి పెన్షన్ సౌకర్యం లేని చిరుద్యోగులైన హోంగార్డులకు ఇచ్చే పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీపై పడిందని చెబుతున్నారు. ఆ సొసైటీని చేజిక్కించుకునేందుకు బదిలీల్లో చేతివాటం చూపించిన సహచర ఉద్యోగితో కలిసి పావులు కదుపుతున్నారంటూ పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అవినీతి తిమింగలాలపై ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించాలని, జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రక్షాళన చేపట్టాలని పలువురు పోలీసు ఉద్యోగులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఇగ్నోలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి (జూలై 2024 సెషన్)కు వివిధ దూరవిద్యా కోర్సులతోపాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 14వ తేదీ వరకూ గడువు పొడిగించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ అటానమస్ కళాశాలలోని ఇగ్నో అధ్యయన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ ఎంఆర్ గౌతమ్ సోమవారం తెలిపారు. వైద్య విద్యార్థులకు హెల్త్ అండ్ న్యూట్రిషన్ కోర్సు, లీగల్ ప్రాక్టీస్‌లో ఉన్నవారికి వివిధ చట్టాలకు సంబంధించిన సర్టిఫికెట్ కోర్సులు, ఉపాధ్యాయులకు అనువైన కోర్సులు ఇగ్నో అందిస్తోందని ఆయన తెలిపారు. ఎంబీఏలో రెండు కొత్త కోర్సులు ప్రారంభించారని, అవి ఇంజినీరింగ్ చేసిన వారికి ఉపాధి కల్పించేవిగా ఉంటాయన్నారు. అలాగే గృహిణులకు వీలైన ఎన్నో కోర్సులను ఇగ్నో అందిస్తోందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి భగవద్గీతలో పీజీ కోర్సు అందుబాటులోకి వచ్చిందన్నారు. యూజీసీ మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులు ఒకేసారి రెండు డిగ్రీలను చేయవచ్చని, ఒకటి రెగ్యులర్ మోడ్లో మరొకటి డిస్టెన్స్ లెర్నింగ్ లేదా ఆన్‌లైన్ మోడ్లో చేయవచ్చని ఆయన తెలిపారు. విశ్వ విద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ఆగస్టు 14 వరకూ లభిస్తాయన్నారు. ఇగ్నో వెబ్‌సైట్‌లో http://ignouadmission.ramarth.edu.in/ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు.

దారి దోపిడీ కేసులో నిందితులకు జైలు

ఆలమూరు: 216ఏ జాతీయ రహదారిలో పలు దోపిడీలకు పాల్పడిన ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. స్థానిక ఎస్సై ఎల్.శ్రీనునాయక్ కథనం ప్రకారం.. దారి దోపిడీకి పాల్పడుతున్న ఆరోపణలపై 2023 అక్టోబర్ 30న పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని సంజీవ్ గాంధీనగర్‌కు చెందిన గుబ్బల మోషే, రాజమహేంద్రవరానికి చెందిన పొడుగు శివను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి వాదోపవాదాలు జరగ్గా నేరం నిర్ధారణ కావడంతో ఆ ఇద్దరికీ మూడేళ్ల జైలు, రూ.పది వేల జరిమానా విధిస్తూ జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్ తీర్పు వెలువరించారు.

యువకుడి ఆత్మహత్య

కొత్తపల్లి: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. యండపల్లి గ్రామానికి చెందిన వై.సుధీర్(27) తాపి మేస్త్రిగా పనిచేస్తున్నాడు. గత కొద్ది రోజులుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీని కారణంగా మనస్తాపానికి గురైన సుధీర్ ఇంటి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై కొత్తపల్లి పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.

చీరకాలం గుర్తుండిపోయేలా..

- 'జాంధాని'తో సరికొత్త ఒరవడి
- నైపుణ్యంతో చరిత్ర లిఖిస్తున్న చేనేత కార్మికులు
- రేపు జాతీయ చేనేత దినోత్సవం





జంధానీ చీరలు నేస్తున్న నేత కార్మికుడు

పిఠాపురం: చేయి తిరిగిన చేనేత కార్మికులు వారు.. వస్త్ర రంగంలో సరికొత్త ఒరవడిని సృష్టించారు.. తమకంటూ గుర్తింపు పొందారు.. కాకినాడ జిల్లాలో చేనేత కార్మికులు చరిత్ర లిఖించారు. జాంధానీ చీరల రూపకల్పనతో ప్రత్యేక ముద్ర వేశారు. అనతి కాలంలోనే అంతర్జాతీయ ఖ్యాతి ఆర్జించారు.

బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం ఇది. ఉప్పాడ కాటన్, సిల్క్‌కు గతంలో పేటెంట్ హక్కు, ఇండియన్ హ్యాండ్‌ లూమ్స్‌లో స్థానం సంపాదించి ముందడుగు వేయగా జాంధానీ చీరల డిజైన్లతో కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ పోస్టల్ కవర్ విడుదల చేసింది. దీంతో ఉప్పాడ చేనేత కళాకారుల జాంధానీ చీర ప్రత్యేకతను చాటింది. ప్రభుత్వ చేయూతతో కుటీర పరిశ్రమగా ప్రారంభమైన జాంధానీ చీరల తయారీ నేడు ప్రపంచ స్థాయి గుర్తింపునకు నాంది పలుకుతుంది. ఏటా రూ.కోట్ల విలువైన క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. కొత్త అందాలను తెచ్చే జాంధానీ సోయగాలు మగువల మనసును ఇట్టే దోచుకుంటున్నాయి. ఇరువైపులా ఒకే విధంగా కనిపించే ఈ చీరలకు రానురాను గిరాకీ పెరుగుతోంది. ఒక కొత్తపల్లి మండలం కొత్తపల్లి, కుతుకుడుమల్లి, వాకతిప్ప, అమీనాబాద్, ఉప్పాడ, మూలపేట, గొల్లప్రోలు మండలం తాటిపర్తి తదితర గ్రామాల్లో గతంలో 50 వరకూ ఉండే మగ్గాలు నేడు 800 వరకూ చేరుకున్నాయి. వీటిని అన్నికులాల వారూ తయారు చేస్తున్నారు. వీటి తయారీలో ఎక్కువగా చిన్నపిల్లలు ఆరితేరుతున్నారు.

జిల్లా పరిధిలో ఇలా..

కాకినాడ జిల్లాలో ప్రత్తిపాడు, గొల్లప్రోలు, ఉప్పాడ చేనేత క్లస్టర్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో మొత్తం 2,300 కుటుంబాలు జీవిస్తుండగా, మొత్తం 3,300 మగ్గాల వరకూ ఏర్పాటు చేశారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో నేతన్నలకు స్వర్ణయుగమని చెప్పాలి. అప్పట్లో చేనేతలకు వివిధ పథకాల కింద జమ చేసిన ఆర్థిక సహాయం రూ.32.66 కోట్లు కాగా, చేనేత పరికరాలకు రూ.2 కోట్లు అందజేసింది. జిల్లాలో చేనేత సహకార సంఘాలు 18 ఉండగా, సభ్యులుగా 2,500 మంది ఉన్నారు. సహకారేతర రంగంలో 2 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. జిల్లాలో చేనేత సహకార సంఘంలో వివిధ వస్త్రాల ఉత్పత్తి విలువ రూ.83.58 లక్షలు కాగా అమ్మకాలతో రూ.165.90 లక్షలు వచ్చింది. ఉప్పాడ జాంధానీ చీరలకు గత వైఎస్సార్ ప్రభుత్వం లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు కింద రూ.10 లక్షలు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కింద బంగారు పతకం అందించింది.

మరింత సహకారం అవసరం



ఉప్పాడ జాంధానీ చీరల తయారీ కార్మికులకు మరింత ప్రోత్సాహం అందించాలి. ముఖ్యంగా వర్షాకాలంలో మగ్గాల్లోకి నీరు వస్తుంది. ఆ సమయాల్లో నేత ఆగిపోతుంది. అలాంటి పరిస్థితులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త డిజైన్లు నేయడానికి తగిన సామగ్రి ఇవ్వాలి. చేనేత సొసైటీలను బలోపేతం చేయాలి.

–లొల్ల వీర వెంకట సత్యనారాయణ, మాస్టర్ వీవర్

చేతి నిండా పని



ప్రస్తుతం చేనేతకు పని చేతినిండా ఉంటోంది. జాంధాని చీర నేసేటప్పుడు ఎక్కడా లూజు లేకుండా చాలా దృఢంగా నేయాలి. అడ్డు, నిలువు పట్టు దారాలనే ఉపయోగించాలి. ప్రతి జాంధాని చీర నేయడానికి ముగ్గురు నుంచి నలుగురు కార్మికులు అవసరమవుతారు. ఒక్కో చీర డిజైన్‌ను బట్టి 20 రోజుల నుంచి 40 రోజుల సమయం పడుతుంది.

–శీలామంతుల రాంబాబు, నేత కార్మికుడు, కొత్తపల్లి

జాతీయ స్థాయిలో వన్నె తెచ్చారు



కాకినాడ జిల్లాలో కార్మికులు చేనేతకు జాతీయ స్థాయిలో వన్నె తెచ్చారు. కేంద్రం ఏ అవార్డు ప్రకటించినా అది జాంధానీకి వచ్చి తీరుతుందంటే అంతా మన నేత కార్మికుల గొప్పదనమే. కొన్నేళ్లుగా ఆన్‌లైన్‌లో ఈ చీరల వ్యాపారం పుంజుకొంది. రానున్న రోజుల్లో మరింత పెరగనుంది. జిల్లాలో కొత్త విధానాలను అందుబాటులోకి తీసుకువస్తున్నాం. అరటి నారతో చీరలు నేయడంపై శిక్షణ ఇచ్చాం.

–కె.పెద్దిరాజు, జిల్లా చేనేత జౌళి శాఖాధికారి, కాకినాడ

మద్యం తాగి బైక్ నడిపిన వ్యక్తులకు జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో పలువురికి శిక్ష విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. ఆ వివరాల్లో వెళ్తే.. కాకినాడ ట్రాఫిక్–1, 2, టూ టౌన్, త్రీ టౌన్, పోర్ట్, తిమ్మాపురం, కరప, ఇంద్రపాలెం, సామర్లకోట పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం తాగి బైక్‌లపై వెళ్తుండగా పలువురిపై కేసులు నమోదు చేశారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపర్చగా 8 మందికి రెండు రోజుల జైలుశిక్ష, 60 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

- అలాగే మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ఏడుగురికి జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు. తాళ్లరేవు మండలం కోరంగి, గొల్లపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం తాగి బైక్‌పై వెళ్తుండగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

భార్యను హత్య చేసిన వ్యక్తి అరెస్ట్

ధవళేశ్వరం: భార్యను హత్య చేసిన భర్తను ధవళేశ్వరం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం వీరభద్రనగర్‌కు చెందిన ధనాల మహేష్ కొంత కాలంగా కుటుంబంతో కలసి ధవళేశ్వరంలోని టిడ్కో గృహాల వద్ద నివాసం ఉంటున్నాడు. 2017లో మహేష్‌కు యర్రాకుల శ్యామలతో ప్రేమ వివాహం జరిగింది. కొంత కాలం నుంచి భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. పెద్దలు పలుమార్లు రాజీ చేశారు. శుక్రవారం రాత్రి భార్యతో తిరిగి గొడవ పడిన మహేష్ తొలుత చేతులో కొట్టి మంచం కింద ఉన్న సిమెంట్ రాయిని తీసుకొని తలపై కొట్టడంతో అపస్మారక స్థితిలోకి చేరుకుంది. శ్యామలను ఆసుపత్రిలోకి చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందింది. శ్యామల సోదరుడు గెద్దాడ మణికంఠ ఫిర్యాదు మేరకు ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం మహేష్‌ను అరెస్ట్ చేశారు. కడియం సీఐ పి.తులసీధర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో సిబ్బందిపై వేటు

అవకతవకల నేపథ్యంలో చర్యలు

సాక్షి ఇంపాక్ట్

కొవ్వూరు: ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యం పక్కదారి పట్టించిన వ్యవహారంలో నలుగురు సిబ్బందిని శాశ్వతంగా విధుల నుంచి తొలగించారు. ఈ విషయాన్ని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (అసిస్టెంట్ రిటైల్ అవుట్‌లెట్ మానిటరింగ్ అధికారి) వైవీవీ లక్ష్మణస్వామి తెలిపారు. కొవ్వూరులోని పెట్రోల్ బంక్ ఎదురుగా ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యవహారంపై ఈ నెల 4న 'రాత్రయితే చేతివాటమే' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ వ్యవహారంపై విచారణ చేశారు. అసిస్టెంట్ రిటైల్ అవుట్‌లెట్ మానిటరింగ్ అధికారి లక్ష్మణస్వామి, రిటైల్ అవుట్‌లెట్ వెరిఫికేషన్ ఆఫీసర్ ఆర్.ఆంద్రూస్‌లు సోమవారం విచారణ చేసి అవకతవకలను గుర్తించారు. తొమ్మిది రకాల మద్యం బ్రాండ్‌లకు గాను 79 బాటిళ్లు స్కానింగ్ చేయలేదని తేలింది. ఈ మద్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా నిబంధనలను అతిక్రమించినందుకు సేల్స్ సూపర్‌వైజర్ కె.సత్తిపండు, సేల్స్‌మెన్లు బి.రాహుల్, ఎస్.స్వామిలను విధుల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద మరో ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న చినబాబు దుకాణం మూసివేసిన తర్వాత పెట్రోలు బంక్ ఎదురుగా ఉన్న దుకాణంలో మద్యం కొనుగోలు చేసుకుని తీసుకెళ్లడం నేరంగా పరిగణించి అతన్ని సైతం శాశ్వతంగా విధుల నుంచి తొలగించారన్నారు.

ఏటీఎం కార్డు మార్చేసి.. సొమ్ము కాజేసి

- ఐ.పంగిడిలో సంఘటన
- బాధితుడు జైళ్ల శాఖ రిటైర్డు ఉద్యోగి



ఐ.పంగిడిలో ఏటీఎం కార్డు మార్చి సొమ్ము కాజేసిన వ్యక్తి

కొవ్వూరు: ఏటీఎంలో సొమ్ము తీసుకునేందుకు వెళ్లిన ఓ విశ్రాంత ఉద్యోగిని ఓ కేటుగాడు మోసగించాడు. ఏటీఎం కార్డు మార్చేసి రూ.33,500 కాజేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఐ.పంగిడికి చెందిన జైళ్ల శాఖ రిటైర్డ్ ఉద్యోగి రేలంగి నారాయణరావు పింఛన్ సొమ్ము డ్రా చేసుకునేందుకు శనివారం ఆ గ్రామంలోని ఒక ఏటీఎంకి వెళ్లారు. ఇందులో సొమ్ము రాకపోవడంతో బయటకు వచ్చేశారు. పక్కనే ఓ కేటుగాడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో సొమ్ములు వస్తున్నాయని చెప్పి ఏటీఎంకి తీసుకుచ్చాడు. సొమ్ము తీసుకునే క్రమంలో పక్కనే ఉన్న ఆ కేటుగాడు సహాయ పడుతున్నట్లు నటించి నారాయణరావు ఏటీఎం కార్డు పిన్ నంబర్‌ను చూశాడు. తర్వాత ఏటీఎం కార్డు తీసుకుని తొలుత బ్యాలెన్స్ బటన్ నొక్కి సొమ్ము ఎంత ఉన్నాయో చూశాడు. దీనిని బాధితుడు ప్రశ్నించడంతో పొరపాటున విత్‌డ్రా బటన్‌కి బదులు బ్యాలెన్స్ బటన్ నొక్కినట్లు చెప్పాడు. ఈ సమయంలో నారాయణరావు ఏటీఎం కార్డుని మార్చేసి వేరే కార్డు ఆయన చేతిలో పెట్టారు. డూప్లికేట్ కార్డు ద్వారా సొమ్ము డ్రా చేసే ప్రయత్నం చేసినప్పటికీ సొమ్ము రాకపోవడంతో బ్యాంకుకు వెళ్లండని చెప్పి ఆ కేటుగాడు అక్కడి నుంచి మోటారు సైకిల్‌పై ఉడాయించాడు. సొమ్ము రావడం లేదని నారాయణరావు ఇంటికి వచ్చేశారు. కొద్దిసేపటి తర్వాత చాగల్లు ఎస్‌బీఐ ఏటీఎం నుంచి రూ.20 వేలు, మరో అర గంటలో నిడదవోలు ఏటీఎం నుంచి రూ.13,500 సొమ్ము తీసుకున్నట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో నారాయణరావు బ్యాలెన్స్ చెక్ చేసుకోవడంతో రూ.33,500 డ్రా చేసుకున్నట్లు రావడంతో బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల్లో నిందితుడి ఫోటోను గుర్తించి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

నన్ను ఇండియాకు తీసుకెళ్లండి..

- అబుదాబి నుంచి వీధివారిలంక మహిళ ఆవేదన
- సామాజిక మాధ్యమాల్లో సెల్ఫీ వీడియో



సెల్ఫీ వీడియో ద్వారా వేడుకుంటున్న జ్యోతి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక శివారు వీధివారిలంకకు చెందిన కాశి జ్యోతి తనను ఇండియాకు తీసుకెళ్లండి అంటూ వేడుకుంది. సుమారు ఆరు నెలల కిందట అబుదాబికి వెళ్లిన ఆమె పని ఒత్తిడి పెరగడంతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సెల్ఫీ వీడియోలో పేర్కొంది. ఆ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తుంది. జ్యోతి భర్త చంద్రశేఖర్ (బాబులు) వీధివారిలంక దళితవాడలో నివాసముంటున్నారు. వేడుకలకు లైటింగ్, సౌండ్ సిస్టం పనులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆర్థిక సమస్యల నుంచి బయట పడేందుకు జ్యోతి పి.గన్నవరానికి చెందిన ఓ ఏజెంట్ ద్వారా అబుదాబికి వెళ్లింది. అక్కడ అరబ్ షేక్ ఇంట్లో పనికి కుదిరింది. తనకు అబుదాబిలో ఆహారం లభ్యం కావడం లేదని, అనారోగ్యం పాలైన సంగతి చెప్పినా యజమానులు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తనను ఇండియాకు తీసుకెళ్లాలంటూ కన్నీటి పర్యంతం అయ్యింది.

రారండోయ్.. వేడుక చూద్దాం

- నేడు సత్యదేవుని ఆవిర్భావ ఉత్సవాలు
- రత్నగిరిపై ఆధ్యాత్మిక శోభ



స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: అన్నవరానికి ఆధ్యాత్మిక శోభ వచ్చింది.. మంగళవారం జరిగే సత్యదేవుని 134వ (సత్య విదియ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు శ్రావణ శుద్ధ పాడ్యమి సోమవారం అంకురార్పణ జరిగింది. ఉదయం పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి స్వామివారి జయంత్యుత్సవాలకు శ్రీకారం చుట్టారు. ప్రధానాలయంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ వేడుకల్లో రెండ్రోజులు జపతపాలు నిర్వహించే 40 మంది రుత్విక్కులకు దీక్షా వస్త్రాలను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అందజేశారు. స్వామి, అమ్మవార్లకు దాత, శ్రీలలితా రైస్ ఇండస్ట్రీ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామి జయంతి ఉత్సవం సందర్భంగా మంగళవారం వాటిని స్వామి, అమ్మవారికి అలంకరించాలని కోరారు.

మార్మోగిన రత్నగిరి

స్వామివారి జయంతి వేడుకలను పురస్కరించుకుని రుత్విక్కుల మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనివేటి మండపంలో సుమారు 50 మంది రుత్విక్కులు జపాలు, పారాయణలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఆస్థాన వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధర గంగబాబు, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు ఇంద్రగంటి వెంకటేశ్వర్లు, కంచిభట్ల రామ్‌కుమార్, సుధీర్, వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యవిదియ పూజలు

సత్యదేవుని 134వ 'సత్యవిదియ' (ఆవిర్భావ దినోత్సవం) సందర్భంగా మంగళవారం సత్యదేవుడు, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. తెల్లవారు జామున రెండు గంటలకు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం దాత మట్టే సత్యప్రసాద్ స్వామి, అమ్మవార్లకు చేయించిన వజ్రకిరీటాలు, వజ్ర కర్ణాభరణాలు, నూతన పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఏడు గంటల నుంచి భక్తుల దర్శనానికి అనుమతిస్తారు. ఉదయం 11 గంటలకు అనివేటి మండపంలో ఆయుష్యహోమం పూర్ణాహుతి జరుగుతుంది. అనంతరం వెండి రథంపై స్వామి, అమ్మవార్ల ఆలయ ప్రాకారంలో ఊరేగిస్తారు. వేద పండిత సత్కారంలో భాగంగా పండితులను సత్కరిస్తారు.



సత్యదేవుడు, అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దాత మట్టే సత్యప్రసాద్



ఉత్సవమూర్తుల వద్ద దాత మట్టే సత్యప్రసాద్ సమర్పించిన వజ్ర కిరీటం, కర్ణాభరణాలు

గరుడ వాహనంపై ఊరేగింపు

సత్యదేవుడు, అమ్మవారిని గరుడ వాహనంపై మంగవారం సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ గ్రామ వీధుల్లో ఘనంగా ఊరేగిస్తారు. ఇందులో భక్తులు, దేవస్థానం సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొనాలని ఈఓ ఆదేశించారు. ఇదిలా ఉంటే సత్యదేవుని ఆలయం, రాజగోపురాలు, రామాలయం, ఆలయ ప్రాంగణాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలు, పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

సొంతింటి కల తీర్చేందుకు క్రెడాయ్ హోం ఎక్స్‌పో



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న క్రెడాయ్ గౌరవ అధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: సామాన్యుల సొంతింటి కల నెరవేర్చేందుకు క్రెడాయ్ (ది కన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) రాజమహేంద్రవరం చాప్టర్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13, 14, 15 తేదీల్లో రాజమహేంద్రవరం చెరుకూరి గార్డెన్స్‌లో క్రెడాయ్ హోం ఎక్స్‌పో 2024ను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కలను నిజం చేసేందుకు ఈ ఎక్స్‌పో దోహదపడుతుందన్నారు. ఇందులో గృహ నిర్మాణానికి అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. క్రెడాయ్ రాజమహేంద్రవరం చాప్టర్ చైర్మన్ సూరవరపు శ్రీనివాసకుమార్, ప్రెసిడెంట్ మన్యం ఫణికుమార్, జనరల్ సెక్రటరీ చల్లా మురళి, ట్రెజరర్ టీవీఎల్ నరసింహారావు, పూర్వపు అధ్యక్షుడు కర్రి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలని ధర్నా



పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ లతాకుమారి

సామర్లకోట: పీబీ దేవం గ్రామానికి చెందిన దళిత యువకుడు చాపల అజయ్‌కుమార్‌పై హత్యాయత్నం చేసిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేపూడి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో సామర్లకోట పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువకుడిపై దాడి జరిగి 60 గంటలు దాటినా నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కంటే ముందు నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తుంటే, విచారణ చేస్తున్నామని చెప్పడం వింతగా ఉందన్నారు. అజయ్‌కుమార్ చేతులు కట్టి చిత్రహింసలకు గురి చేశారన్నారు. చట్టాలను ఎవరికి వారే చేతిలో తీసుకుంటే పోలీస్ స్టేషన్లు ఎందుకని ఆయన ప్రశ్నించారు. సంఘటన జరిగిన తరువాత పీబీ దేవం గ్రామానికి వచ్చిన డీఎస్పీ, పోలీసుల దృష్టికి జరిగిన సంఘటనను తల్లిదండ్రులు చాపల లక్ష్మి, సత్తిబాబులు తీసుకు వెళ్లారన్నారు. ప్రస్తుతం తిరిగి స్టేట్‌మెంట్ ఇవ్వాలని కోరడం ఏంటన్నారు. పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న వారితో డీఎస్పీ లతాకుమారి చర్చలు జరిపారు. ఇప్పటికే కొంత మందిని అదుపులోకి తీసుకున్నామని, మరి కొంతమందిని అరెస్ట్ చేయడానికి రెండు టీమ్‌లు తిరుగుతున్నాయని ఆందోళనకారులకు డీఎస్పీ చెప్పారు. సమయం ఇస్తే అందరినీ అరెస్ట్ చేస్తామన్నారు. దాంతో 24 గంటలు వేచి చూస్తామని ఆందోళన కారులు చెప్పి నిరసన విరమించారు. ఐక్యవేదిక నాయకులు కాళ్ల లక్ష్మీనారాయణ, వల్లూరి నాని, గొడత విజయకుమార్, కాపవరపు కుమార్, మందపల్లి సత్యనారాయణ, రవి ఆధ్వర్యంలో ఈ ఆందోళనలో జరిగింది.